వెళ్ళిపోతూ ఉంటుంది. అందుచేత మనస్సుకు భగవంతుడి స్మరణ అలవాటు చేసెయ్యి. భగవంతుడిని స్మరించటం వలన ఆయనతో చుట్టరికం కలుస్తుంది. మనకు నిజమైన బంధువు భగవంతుడే. స్మరణ వలన ఆయన పట్ల ప్రేమ కలుగుతుంది. మీరు మంచి విషయాలను ఆలోచిస్తూ ఉంటే, ఈశ్వరుడి గురించి ఆలోచిస్తూ ఉంటే అది కూడా తపస్సే. ఇంట్లో ఏదైనా కష్టం వచ్చినా అది భరించగలుగుతారు అనుకోండి, అది కూడా తపస్సే. తపస్సు అంటే ఎక్కడికో పారిపోయి కూర్చోవటంకాదు మీ ప్రారబ్దం కొట్టే దెబ్బలను భరించటం కూడా తపస్సే. ప్రారబ్దాన్ని మీరు ఇష్టంతో అనుభవిస్తూ ఉంటే అటువంటి ప్రారబ్దాన్ని ఇంక భగవంతుడు వచ్చే జన్మలో రానివ్వడు. ప్రారబ్దాన్ని మీరు ఎలాగైనా అనుభవించాలి అందుచేత దానిని ఇష్టంతో అనుభవించండి. మీరు చేయవలసిన సాధన ఏమిటి అంటే మీ లోపల ఏదో దేహంతో ఏకం అవుతోంది అని మీకు తెలుస్తూ ఉంటుంది. ఆ ఏకమయ్యే దానిని విడదీసి, దేహానికి సంబంధించిన స్మరణ ఆపేసి దైవస్మరణ చేయాలి. అలా దైవ స్మరణ చేయగా చేయగా, ఆత్మస్మరణ చేయగా చేయగా మీకు ఆత్మబుద్ధి కలుగుతుంది, దేహబుద్ధి కరిగిపోతుంది.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 20-02-2009, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మౌనం బంగారం, ఈ శబ్దాలు రాగి, వెండి. మౌనం మిమ్మల్ని హృదయంలోనికి తీసుకొని వెళ్ళినంత వేగంగా శబ్దం తీసుకొని వెళ్ళదు. కాని మౌనం అంటే మీకు ఇష్టం ఉండదు, శబ్దం అంటే ఇష్టపడతారు. మనం అలా అలవాటు పడిపోయాము. మౌనం అంటే నోరుమూసుకొని కూర్చోవటంకాదు. మనస్సు ఎక్కడైతే అణిగిపోయిందో అక్కడ నుండి మౌనం వస్తుంది. ఆ మౌనం బోధించినట్లు శబ్దం బోధించలేదు. మనం ఇతరులను ద్వేషిస్తాము కాని మనలను మనం ద్వేషించుకోము. నన్ను నేను ప్రేమించుకొంటాను కాని, నేను మిమ్మల్ని ప్రేమించలేను. మనందరం ఒక్కటే అన్న సంగతి తెలియక ఇవన్నీ వస్తున్నాయి. రూపాలు తేడా, రంగులు తేడా, గుణాలు తేడా కాని లోపలఉన్న పరమార్థం ఒక్కటే. ఇన్ని రూపాలు ధరించినవాడు భగవంతుడే. ఆయన సంకల్పం లేకుండా అసలు రూపం రాదు. మీరూ, మేము ఒక్కటే అన్న సంగతి తెలియకపోవటం వలన ద్వేషించటం జరుగుతోంది. మనందరం ఒక్కటే కాని అది మనకు అనుభవంలో లేదు. అందరం ఒక్కటే అని మనకు తెలిసేవరకూ అంటే అభేదస్థితి పొందేవరకు ప్రతీవాడు శవాలను మోస్తూ ఉండవలసిందే, పునర్జన్మలు రాకుండా ఎవడూ

ఆపుచేయలేడు. మనకు బయట నుండి ఏది వచ్చినా అది పోతుంది. శరీరం పుట్టింది అంటే చనిపోయి తీరుతుంది. ఒకవేళ బయటనుండి నీకు సుఖం వచ్చినా, దుఃఖం వచ్చినా అది కాలప్రవాహంలో పోతుంది. సృష్టిలో ఏ వస్తువులో, ఎక్కడా సుఖం లేదు, శాంతిలేదు. కాని ఉందని అనుకొంటున్నాము. ఎక్కడైతే శాంతిలేదో అక్కడ శాంతి ఉందని అనుకొంటున్నాము, అలా అనుకోవటానికి మన అజ్ఞానం కారణం. మనం నేను, నేను అంటాము. ఆ నేను రూపంలోనే అజ్ఞానం ఉంది, మాయ అంతా నేను రూపంలోనే ఉంది. మనకు అందరికి భగవంతుడు అంటే ఇష్టం ఉండదు, ఎవరి దేహం అంటే వారికి బాగా ఇష్టం, అందరికి శరీరం మీద విపరీతమైన అభిమానం. ఈ శరీరం పోతుంది, ఎంతోకాలం ఉండదు అని అంటే వారు బెంగపెట్టుకొంటారు. శరీరంపోతే ఏమీ పోదు. ఏదో పోతుంది అని మనస్సుకు అనిపిస్తుంది. శరీరం వచ్చినప్పడు మనం రాలేదు అందుచేత శరీరం పోయినప్పడు మనం కూడా పోము.

సుఖంకాని, శాంతిగాని బయట నుండి వచ్చేదికాదు. వారికి గౌరవం వచ్చింది అంటారు అనుకోండి, అది పోతుంది అని అర్థం. బయట నుండి ఏది వచ్చినా అది పోతుంది ఎందుచేతనంటే అది నిజంకాదు. వివేకం అంటే గడుసుతనంగా మాట్లాడటంకాదు. కొంతమంది వారి మనస్సులో ఏముందో మనకు తెలియనివ్వరు. ఇవన్నీ లోకవిషయాలు. వివేకం అంటే ఏమిటి అంటే ఇది సత్యము, ఇది సత్యం కాదు, ఇది శాశ్వతము, ఇది శాశ్వతంకాదు అని మనకు తెలియాలి. సత్యాన్ని, అసత్యాన్ని వేరు చేయగలగాలి, ఆ పరిశీలనాశక్తి మనకు ఉండాలి. ఇది సత్యమా, అసత్యమా, దీనివలన పరిణామంలో దుఃఖం వస్తుందా, సంతోషం వస్తుందా అన్నీ చూసుకోవాలి. మనకు దుఃఖాన్ని తీసుకొని వచ్చే వస్తువు సంతోషాన్ని ఇస్తుంది అనుకొంటే మనకు వివేకం లేదు అని అర్థం. అయితే మనలో ఉన్న రాగద్వేషములు, మనకు వివేకాన్ని రానివ్వవు. ఎంతో పూర్వపుణ్యం ఉంటేగాని, సత్కర్మ చేసి ఉంటేగాని ఇది సత్యం, ఇది అసత్యం అని వేరు చేయలేము. వైరాగ్యం ఉంటే ప్రపంచంలో ఏ వస్తువు మీద కూడా వాడి మనస్సు వాలదు. ఎందుచేతవాలదు అంటే అది నిజంకాదు అని వాడికి తెలుస్తూ ఉంటుంది. అది నిజం అనుకొన్నప్పడు మనం ఎంత ఆపు చేసుకొన్నా మనస్సు అక్కడకు వెళ్ళిపోతుంది, అది నిజం కాదు అని మనకు తెలిస్తే మన మనస్సును అక్కడకు వెళ్ళు అని తోలినా అది వెళ్ళదు, మనం తాత్కాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోకూడదు, మనకు దీర్ఘదృష్టి ఉండాలి. ఈ రోజు గడిచిపోతే చాలు అనుకోకూడదు, దాని పరిణామం ఎలా ఉంటుంది అనేది చూసుకోవాలి. ఎవడికీ తప్ప చేయాలని ఉండదు. మనిషి తప్ప ఎందుకు చేస్తున్నాడు అంటే అజ్ఞానం వలన

చేస్తున్నాడు. ఈ తప్పు చేసేవారు కూడా మంచివారే అయితే వాడి అజ్ఞానం వలన మనిషి పొరపాటు చేస్తున్నాడు, జ్ఞానం కలిగితే వాడు చేయడు. కోట్లాది మందిలో కొద్దిమంది మాత్రమే సాధన చేస్తారు. ఇలా సాధన చేసే కోట్లాది మందిలో ఎవడో ఒక్కడికి మాత్రమే నిజం తెలుస్తుంది అని పరమాత్మ చెప్పాడు.

మనకు ఎవరికీ అశాంతి అంటే ఇష్టం ఉండదు, దుఃఖం అంటే ఇష్టం ఉండదు. ఎందుచేతనంటే అది మన స్వరూపంలో లేదు. ఒక్క స్వరూప సుఖం తప్పించి ఏది వచ్చినా అది పరిణామంలో దుఃఖంగా మారిపోతుంది, ఈ రోజు మీరు బాగానే ఉండవచ్చు ఎప్పటికైనా మీ సంతోషం దుఃఖంగా మారిపోవును. దేహం ప్రారబ్దాన్నిబట్టి వెళ్ళిపోతూ ఉంటుంది. సత్పురుషుల మంచికర్మ, దుష్టుల చెడ్డకర్మ కలిసి అవతారం వస్తుంది. అది సమిష్టి ప్రారబ్దం. అవతారపురుషుడికి వ్యక్తిగతమైన ప్రారబ్దం ఏమీ ఉండదు ఎందుచేతనంటే అక్కడ నేను లేదు. ఒకసారి సీతమ్మ ఏమంది అంటే ఈ రాక్షసులతోటి మనకు వైరం ఎందుకు వారు మనకు ఏమీ అపకారం చేయటంలేదుకదా, ఏదో ఋషులను ప్రజలను కొట్టుకొని తింటున్నారు అంటుంది. సీతమ్మ చెప్పింది బాహ్యానికి బాగానే ఉంది. అయితే అప్పుడు రాముడు ఏమన్నాడు అంటే నీ దేహం, నా దేహం కూడా ఏదో కార్యక్రమం నిమిత్తం ఈ భూమికి వచ్చాయి. రాక్షససంహారం లేదు అనుకో ఈ శరీరాలు భూమిమీదకు ఎందుకు వచ్చినట్లు అన్నాడు. అంటే ఈ దేహం భూమి మీదకు ఎందుకు వచ్చిందో ఆ పని జరిగిపోతూ ఉంటుంది. జటాయువు యొక్క వైభవం చూడండి దశరధుడికి లేని అదృష్టం జటాయువుకు వచ్చింది. దశరధుడికి రాముడి చేతితోటి కర్మకాండ జరుగలేదు కాని జటాయువుకు ఆయన చేతితో కర్మకాండ చేసాడు రాముడు. జటాయువుకు ఆయన చేతులతో కర్మకాండచేసి ఊరుకోలేదు, మహర్షులు, యోగులు ఏ ఉత్తమలోకాలకు వెళుతున్నారో నువ్వు కూడా అక్కడకు వెళ్ళు అన్నాడు, అది రామాజ్ఞ. రామాయణంలో వాల్మీకి ఒకమాట చెప్పాడు దుష్టులు ఉన్నచోట, పాములు ఉన్నచోట మీరు తిరగవద్దు అని చెప్పాడు. ఎక్కువ పాములు మసలుతున్నాయి అనుకోండి మనం అక్కడకు వెళ్ళి కూర్చోము, దుష్టులు కూడా అంతే. దుష్టులు ఏమి చేస్తారు అంటే మీరు వాళ్ళకు ఏమి అపకారం చేయనక్కరలేదు, వారు మీకు అపకారం చేస్తారు. అది వారి స్వభావం. వాడు అన్యాయం చేసాడు అని వారిని విమర్శించటం అనవసరం, వారికి దూరంగా ఉండండి. అక్కడకు వెళ్ళి కూర్చుంటే మీదే తప్పు అవుతుంది అని చెప్పాడు.

పుట్టుకతోటే మనిషికి ఒకో స్వభావం ఉంటుంది, ఆ స్వభావాన్ని జయించకుండా నీకు

ఆత్మజ్ఞానం కలుగదు. స్వభావం ఎక్కడ ఉంది నీ మనస్సులో ఉంది. ఆ మనస్సులో నుండి నువ్వు బయటపడితేకదా నీకు అమృతానుభవం కలగటం. మనస్సులో నుండి నీవు బయటపడాలంటే ఎంతో కృషి చేయాలి, కాలం కలిసిరావాలి, గురువు అనుగ్రహం ఉండాలి. ఇతరులతో పోరాటంకాదు, నీతో నువ్వు పోరాడుకోవాలి. మన దగ్గర పెద్ద తప్పు ఏమిటి అంటే మనలను మనం పరిశీలించుకోము, ఇతరులను పరిశీలిస్తూ ఉంటాము. ఇతరులను పరిశీలించటం వలన, వారిలో ఉన్న తప్పులను తెలుసుకోవటం వలన నీకు ఏమీ ఉపయోగం లేదు. నిన్ను నీవు పరిశీలించుకొని, నీలో ఉన్న బలహీనతలను తెలుసుకొని, వాటిని తొలగించు కొంటే నీకు చైతన్యస్థాయి పెరుగుతుంది. ఇతరులను పరిశీలించేకొలది నువ్వు అజ్ఞానంలో పడిపోతావు, చీకటి లోకాలకు వెళ్ళిపోతావు. మంచి చెడ్డ ఇవి అన్నీ మనస్సు యొక్క కల్పితం. మనస్సు కూడా నిజం కాదు అది కల్పితం. అది కల్పితం కాబట్టి అది ఏదో ఒకటి కల్పిస్తూ ఉంటుంది. నువ్వు మనోనిగ్రహం కోసం ప్రయత్నం చేస్తున్నావు. ఈశ్వరుని దయ లేకుండా మనోనిగ్రహం సాధ్యం కాదు, ఈశ్వరుని దయలేకుండా మనస్సు అణగదు. లోకాన్ని జయించటం అంటే ఇతరుల రాజ్యాలను ఆక్రమించుకోవటం, మనుషులను చంపటంకాదు, వెయ్యిఎకరాలు పొలం, డబ్బు సంపాదించటం కాదు. లోకం అంటే రాగద్వేషాలు. కొంతమంది నిన్ను స్తోత్రం చేస్తారు, కొంతమంది నిందిస్తారు, ఇవన్నీ ప్రకృతికి సంబంధించిన గొడవలు, వీటి ప్రభావం నీ మీద పడకుండా చూసుకొంటే వాడు లోకాన్ని జయించినట్లు అవుతుంది.

ఒకసారి వివేకానందుడు రామకృష్ణుడుతో మీ దగ్గర కూర్చొన్నప్పుడు నాకు బాగానే ఉంది. బయటకు వెళ్ళినప్పుడు కొంతమంది దేవుడు ఉన్నాడు అంటున్నారు, కొంతమంది దేవుడు లేడు అంటున్నారు. ఇంతకీ నన్ను ఏమి చేయమంటారు అని అడిగాడు. రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే నువ్వు దేవుడు లేడు అనేవారి పార్టీలో చేరకు, వారితో సహవాసం చేయవద్దు. దేవుడు ఉన్నాడు అని చెప్పేవారితో సహవాసం చెయ్యి. నువ్వు చెడ్డగొడవలలోనికి వెళ్ళటం ఎందుకు అన్నారు. నీ హృదయంలో ఉన్న నిజం తప్పించి జీవితంలో అన్నీ తలంపులే. అయితే నీ హృదయంలో ఉన్న నిజం తలంపులకు అందదు, నీ మాటకు అందదు, నీ మనస్సుకు అందదు. అందుచేత అది లేదు అని నీవు అనుకొంటున్నావు. అది నిజంగా లేదు అనుకోండి రామకృష్ణుడికి కూడా అనుభవంలోనికి రాదు, అది ఉంది కాబట్టే ఆయనకు అనుభవంలోనికి వచ్చింది. ప్రతీ మనిషికీ లోపల వాచింగ్ ఉండాలి, సహనం పెంచుకోవాలి. సహనం లేకపోతే హృదయం యొక్క లోతులు పెరగవు. హృదయం యొక్క లోతులు పెరగకుండా జ్ఞానం రాదు. జ్ఞానం

అనేది పైనుండి పోసేది కాదు, అది లోపలనుండి రావాలి. కొంతమంది ఎప్పడూ ఏదో విషయం గురించి వర్రీపడుతూ ఉంటారు. సాధనలో మొట్టమొదట చేయవలసింది ఏమిటి అంటే నువ్వు వర్రీ పడటం ఆపుచేయాలి. నువ్వు వర్రీపడటం వలన వారు పెద్దవాళ్ళు అయిపోరు, ధనవంతులు అవ్వరు. వర్రీపడటం ఆపుచేయటమే గొప్ప సాధన. అందుచేత కుటుంబ విషయాలను గురించిగాని, లోకవిషయాలను గురించిగాని ఏ విషయంలోను నువ్వు వర్రీపడవద్దు. మనస్సులో వారి క్షేమం కోరవచ్చుగాని వర్రీపడటం వలన వారు ఏమీ అభివృద్ధిలోనికి రారు.

మీరు లోకాన్ని చూస్తే చూడండి కాని లోపల స్వరూపాన్ని వదిలేసి, ఈశ్వరస్మరణ వదిలేసి అస్తమాను మీరు లోకాన్ని చూస్తూ ఉంటే మీ మనస్సు పాడైపోతుంది, వివేకం చచ్చిపోతుంది, చివరకు కుళ్ళిపోతారు. దూర్వాసుడికి కోపం ఎక్కువ అని భగవాన్‌తో అంటే దూర్వాసుడికి కోపం ఎక్కువ, కోపం ఎక్కువ అనుకొనే బదులు వాడు కామాన్ని జయించాడు, అది జ్ఞాపకం పెట్టుకోండి అనేవారు. మంచిని వదిలేసి చెడ్డ పట్టుకొంటారు ఏమిటి? ఎదుటివారిలో మంచీ ఉంటుంది, చెడ్డా ఉంటుంది. మనం ఏమి చేస్తాము అంటే మంచిని వదిలేసి చెడ్డను పట్టుకొంటాము ఎందుచేతనంటే మన బుద్ధి మంచిదికాదు. ఒకసారి ఏసుక్రీస్తు, ఆయన భక్తులు సముద్రం ఒడ్డున నడుస్తున్నారు, అక్కడ ఒక కుక్క చనిపోయి ఉంది. ఒక భక్తుడు ఏమన్నాడు అంటే అది చనిపోయి చాలాకాలం అయి ఉంటుంది, చాలా వాసన వస్తోంది అన్నాడు. ఏసుక్రీస్తు కుక్క వంక చూసి దాని పళ్ళు ఎంత తెల్లగా ఉన్నాయి అన్నాడు. కుక్క కుళ్ళిపోయింది అని దానిలో ఉన్న చెడ్డను చూసేబదులు దాని పళ్ళు చూడండి, ఎంత తెల్లగా ఉన్నాయో అన్నాడు. అంటే దృష్టిని మార్చుకోవాలి, దృష్టి మార్చుకోకుండా దృశ్యం మారదు. మనకు మనో దేహములతో ఎంతకాలం అయితే తాదాత్మ్యం ఉందో అంతకాలం ప్రారబ్దం దెబ్బలు కొడుతూ ఉంటుంది. మనో దేహములతో తాదాత్మ్యం పోతే ప్రారబ్దంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాడికేమీ అనిపించదు, ఆ ప్రారబ్దం అంతా ఒకటిలేని సున్నలతో సమానం. వాలి భార్య తార వాలితో ఏమంది అంటే నీకు నీ తమ్ముడి మీద కోపం ఎక్కువగా ఉంది. కోపం ఎక్కువగా ఉండటం వలన రాముడు దేవుడు అని నీకు తెలియటం లేదు. రాముడు సామాన్య మానవుడు అనుకొంటున్నావు, చిటికెనవేలితో లోకాన్ని భస్మం చేయగలడు. మానవుడు ఎంత నా ముందు అని నీవు అనుకొంటున్నావు, ఆయన మానవుడి రూపంలో ఉన్న దేవుడు అందుచేత నీవు యుద్ధానికి వెళ్ళవద్దు, రాజీపడటం మంచిది అని చెప్పింది. తార ఇంకా ఏమి చెప్పింది అంటే నీకు ఏమిటి, నాకు ఏమిటి ఈ సృష్టిలో ఎవరికైనా కోపం వచ్చినప్పడు ఆ కోపం మనకు

బంధువు, ఆ కోపం మనకు స్నేహితుడు అనిపిస్తుంది కాని అది స్నేహితుడు కాదు, అది విరోధి. విరోధి ఎంత అపకారం చేస్తాడో అది మనకు అంత అపకారం చేస్తుంది అని చెప్పింది.

మా ఆయనకు ఈ మధ్య తాగుడు ఎక్కువ అయిపోయింది, అందుచేత అశాంతి వస్తోంది అని ఈ మధ్య ఒకరు నాతో చెపుతున్నారు. లోకంలో అనేకమంది తాగుతున్నారు. అప్పుడు నీకు బాధ రావటంలేదు. మీ ఆయన తాగుతూ ఉంటే నీకు బాధ వస్తోంది, అశాంతి వస్తోంది. అంటే నువ్వు ఏమనుకొంటావు మా ఆయనే నేను అనుకొంటున్నావు. అలా అనుకోవటం మానెయ్యి, దుఃఖం లేదు, అశాంతి లేదు. ఆయనకు సేవ చెయ్యవద్దు అని కాదు, సేవ చెయ్యి, తాగుడు మానిపించటానికి మంచిమాటలు చెప్పు. అంతేగాని ఆయనే నేను అనుకోవద్దు. నువ్వు నేను నేను అంటున్నావు కదా, ఆ నేనే నువ్వు కానప్పుడు మీ ఆయన నువ్వు ఎలా అవుతావు. ఆయనే నేను అనుకొన్నంతకాలం ఆవిడకే కాదు, మీకు, నాకు అందరికీ అశాంతి తప్పదు. నువ్వు దేహాన్ని ఆత్మ అనుకోవటం వలన మీ ఆయన మీద మమకారం వస్తోంది. లోపల ఉన్న సత్యవస్తువు, ఆత్మ నీకు తెలిసింది అనుకో ఇంక ఏమీ లేదు. నీ డ్యూటీ ఏదో నీవు చేస్తావు, అప్పుడు మమకారం లేదు, అహంకారం లేదు. పుస్తకాలు చదివినవాడు పండితుడు అని పరమాత్మ చెప్పలేదు. ఏనుగులో, కుక్కలో, కుక్క మాంసం తినేవాడిలో, ఆవులో, బ్రాహ్మణుడిలో ఇలా అంతటా ఏకవస్తువును ఎవడైతే దర్శిస్తున్నాడో వాడు పండితుడు అని చెప్పాడు, అప్పుడు ఇంక వాడికి వికారములు లేవు. అంతటా ఒకే వస్తువును దర్శిస్తూ ఉంటే ఇంక వికారాలు ఏమి వస్తాయి. భిన్నత్వం ఉన్నంతకాలం భయం తప్పదు, అబేధస్థితిని పొందితే భయానికి ఆస్కారం లేదు. మీకు వచ్చే ప్రతీతలంపుకు దేహం కారణమవుతుంది లేకపోతే పేరు కారణమవుతుంది. మీకు దేహం గొడవ, నామం గొడవ లేదు అనుకోండి తలంపులు రావటానికి అవకాశం లేదు.

మీ దేహం ద్వారా ఏ సంతోషం వచ్చినా అది దేశకాలములకు లోబడి ఉంటుంది. దేశకాలములకు అతీతంగా ఉన్నది ఆత్మసుఖం ఒక్కటే. ఉన్నది ఒక్కటే, అదే బ్రహ్మం, అదే ఆత్మ. ఆ బ్రహ్మమే నీ అజ్ఞానం వలన లోకంగా కనిపిస్తోంది. ఒకోసారి చీకటిలో తాడు పాములాగ కనిపిస్తుంది. తాడు పాము అవ్వలేదు, చీకటిలో నీకు సరిగా దృష్టి ఆనక అది పాములాగ కనిపిస్తోంది అంతే. నీకు ఉన్న అజ్ఞానం వలన భగవంతుడే లోకం కింద కనిపిస్తున్నాడు కాని లోకం లేదు. తాడు ఎంత సత్యమో పాము అంత అబద్ధం అలాగే భగవంతుడు ఎంత సత్యమో ప్రపంచం అంత అబద్ధం. ప్రపంచమూ సత్యమే, దేవుడూ సత్యమే అని ఎక్కడా ఉండదు.

ఎందుచేతనంటే సత్యం ఒక్కటిగానే ఉంటుంది. రమణ మహర్షిగారిని ఈ ప్రపంచం ఉందా అని అడిగితే ఆయన ఉందని చెప్పలేదు, లేదు అని చెప్పలేదు, ఉన్న దానివలె కనిపిస్తోంది అని అన్నారు అంటే లేదని అర్థం. మనిషికి మనస్సు ఉంది, దేహం ఉంది, ఈ రెండింటివలన ఉపయోగం ఉందా అని భగవాన్‌ను అడిగితే నీ హృదయంలో ఒక సత్యం ఉంది. దానిని తెలుసుకోవటానికి నీ మనస్సును, దేహాన్ని ఉపయోగించుకో. దానిని తెలుసుకోవటానికి ఈ రెండింటిని ఎంత వరకు ఉపయోగించు కొంటున్నావో అంతవరకే వాటి అవసరం, అది తప్పించి మిగతాది అంతా వేస్టు అని చెప్పారు. అలా కాకుండా మనో దేహములను ప్రకృతిగొడవలకు ఉపయోగిస్తున్నావు అనుకో నీ జీవితం అంతా వృధా అని చెప్పారు.

మనం ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకోవటం అనవసరం. ఇష్టాలు, అయిష్టాలు పెట్టుకొంటే మనస్సు బాహ్యముఖానికి పోతుంది. నీకు ఇష్టం లేదు అనుకో, అయిష్టం లేదు అనుకో, మనస్సు యొక్క చాపల్యం ఆగిపోతుంది, నువ్వు గోవిందుడిని స్మరించుకో, స్మరణ వలన కూడా మనోనాశనం అవుతుంది అని ఆచార్యులవారు అన్నారు. నువ్వు ఎన్ని పుస్తకాలు వ్రాసినా, ఎన్ని ప్రయాణాలు చేసినా లోపల ఉన్న నిజంతో నీకు తాదాత్మ్యం లేనప్పుడు వాటివలన ఏమీ ప్రయోజనం లేదు. ఒక గుడ్డివాడు, ఇంకో గుడ్డివాడికి ఎలా దారిచూపించగలడు, చివరకు ఇద్దరూ కలిసి గోతిలో పడతారు. బయటగొడవలను, మనుషులను, వస్తువులను చూస్తూ ఉంటే నీ మనస్సు కలుషితం అవ్వకుండా ఆగదు. ఇలా ఎంతకాలం అయితే బాహ్యంగా తిరుగుతావో అంతకాలం నీ మనస్సు కలుషిత మవుతుంది, మరల ఆ కల్మషం పోగొట్టుకోవటానికి పూజలు, జపాలు, సాధనలు, అంటే బాడి చేసుకోవటం కడుక్కోవటం. అందుచేత మనస్సును స్థిరంగా ఉంచుకో. సొంత ఆలోచన విడిచిపెట్టవద్దు, గమ్యాన్ని మర్చిపోవద్దు, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి, అప్పడు నీవు ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. మనం కల్పించుకొన్న గొడవలను వదిలేయటమే సాధన. గదిని శుభ్రం చేయటం అంటే గదిలో ఉన్న దుమ్మును తీసేయటం, శుభ్రత అక్కడే ఉంది. సాధన పేరుమీద, నువ్వు కల్పించుకొన్న గొడవలను వదిలేస్తే ఉన్న వస్తువు ఉన్నట్లుగా నీకు గోచరిస్తుంది. చేతులతో మంచిపనులు చేయాలి, కళ్ళతో మంచిదృశ్యాలు చూడాలి, నోటితో మంచిమాటలు మాట్లాడాలి, మనస్సుతో ఈశ్వరుడిని స్మరించాలి, సజ్జనసాంగత్యం చేయాలి. అందరి శుభాన్ని కోరుకోవాలి. అప్పడు మనస్సు నిర్మలమవుతుంది. ఆ పనులు అన్నీ ఎందుకు చేయటం అంటే ఎవరినో ఉద్ధరించటానికి కాదు, మనం పవిత్రులం అవ్వటం కోసం ఇవి అన్నీ చేయాలి. పవిత్రత లేకుండా, ప్రావీణ్యత

లేకుండా, ఏకాగ్రత లేకుండా ఈశ్వరానుభవం నీకు కలుగదు. కొంతమంది భగవాన్‌తో ఏమని చెప్పేవారు అంటే నేను నిన్ను పట్టుకొన్నాను. ఇప్పుడు నిన్ను విడిచిపెట్టేయాలని ఉంది, నా పట్టు వదిలేసానుగాని నన్ను నువ్వు వదలటం లేదు అనేవారు. ఒకవేళ మనకు గురువు మీద కోపం వచ్చి ఆయనను వదిలేసినా ఆయన మనలను విడిచిపెట్టడు, ఆయన ఏ స్థాయిలో ఉన్నాడో ఆ స్థాయికి మనలను తీసుకొనిపోయే వరకు జన్మజన్మలకు మనలను వెంటాడతాడు, మనలను విడిచిపెట్టడు, వాడు గురువు. గురువు ప్రేమ లోకానికి సంబంధించిన ప్రేమకాదు. అది అలౌకికమైనది, అభౌతికమైనది. చైతన్యం యొక్క స్వరూపమే ప్రేమ. అది మనలు పట్టుకొన్నప్పడు ఇంక మనం ఎక్కడికి వెళ్ళలేము. మన ఇంట్లో ఒకరిని ఒకరు ప్రేమించుకొన్నా మరల ప్రేమించటం మానేస్తాము, ఈ ప్రేమలు లౌకికమైనవి, ఇవి కేవలం జీవలక్షణాలు. ఒక్కసారి మీరు గురువు యొక్క అనుగ్రహంలో పడితే మీ లోపల ఉన్న అజ్ఞానాన్ని శుభ్రంగా తొలగించే వరకూ గురువు మిమ్మల్ని విడిచిపెట్టడు. మనలో ఉన్న మాయను, అజ్ఞానాన్ని తొలగించి ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు, వాడు గురువు. ప్రతీ చిన్నవిషయానికి మనస్సులో అల్లరి పెట్టుకోవద్దు, మీరు శాంతిని కాపాడుకోండి. ఎందుచేతనంటే శాంతిని కాపాడుకోకపోతే సాధన జరుగదు. అన్ని కాలాలలో, అన్ని అవస్థలలో శాంతిని కాపాడుకోండి. పురుషుడికి నిజమైన భార్య శాంతే, స్త్రీకి నిజమైన భర్త శాంతే. మీకు శాంతి కుదిరింది అనుకోండి మనస్సు యొక్క చాపల్యం తగ్గిపోతుంది. సంసారంలో గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి, లోకానికి సంబంధించిన గొడవలు, ప్రకృతికి సంబంధించిన గొడవలు వస్తూ ఉంటాయి, పోతూ ఉంటాయి. కాని మీరు శాంతిని కాపాడుకోండి, అదే సాధన యొక్క గమ్యం.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 28-02-2009, పాలమూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు అవకాశం ఉన్నంతవరకు సత్కర్మ చేయటం మంచిది. మన రూపం, మన నామం మరిచిపోయి మనం పని చేసినా అది సత్కర్మే. మనం జపం చేస్తున్నాము, సత్కర్మ చేస్తున్నాము, యాత్రలు చేస్తున్నాము వీటి అన్నింటి యొక్క ప్రయోజనం మనస్సును బాగుచేసుకోవటమే. మన ఇంద్రియాలను సద్వినియోగం చేసుకొని మనస్సును బాగు చేసుకోవాలి. మనం ఈ భూమి మీదకు వచ్చిన పని అది. మనం ఈ భూమి మీదకు వచ్చి మరల ఈ భూమిని విడిచిపెట్టి వెళ్ళేటప్పటికి మనం ఎంతోకొంత మనస్సును పవిత్రం